
సాక్షి
బాపట్ల
మంగళవారం । 26 । సెప్టెంబర్ । 2023



కానుకల లెక్కింపు

గుడ్లవల్లేరు: శ్రీకొండలమ్మ ఆలయ హుండీల్లో కానుకలను సోమవారం లెక్కించారు. 62 రోజులకు రూ.27,95,004 , 9 గ్రాముల బంగారం, 290 గ్రాముల వెండి లభించాయి.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద సోమవారం 5,706 క్యూసెక్కులు విడుదల చేశారు.

సబ్‌జైలు పరిశీలన



తెనాలిరూరల్: తెనాలి సబ్‌జైలును రెండో అదనపు మున్సిఫ్ మేజిస్ట్రేట్ జె. శ్రీసీత సోమవారం సాయంత్రం పరిశీలించారు. అనంతరం మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఖైదీలతో మాట్లాడారు.

న్యూస్‌రీల్

వైభవంగా నృసింహుని పవిత్రోత్సవాలు



మంగళగిరి: నగరంలోని శ్రీలక్ష్మీనృసింహ స్వామి పవిత్రోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. రెండో రోజు సోమవారం ఉదయం అగ్నిమథనం, పంచగవ్యారాధన, పంచగవ్య ప్రాశన, పంచాగ్ని ప్రణయనము, ఉక్తహోమాలు నిర్వహించి పవిత్రాలతో గ్రామోత్సవం నిర్వహించారు. సాయంత్రం నిత్యహోమం, దిక్పూక్షహోమం, నవగ్రహహోమం, ప్రసాద గోష్ఠి, న్యాసం నిర్వహించి రాత్రి 8 గంటలకు పవిత్రముల శయనాధి వాసము నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ ఈఓ ఎ.రామకోటిరెడ్డి పర్యవేక్షించారు. అర్చకులు పూజలు నిర్వహించారు.

ముగిసిన ఎస్‌ఐ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు



నగరంపాలెం(గుంటూరు వెస్ట్): గుంటూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జరుగుతున్న ఎస్‌ఐ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు సోమవారంతో ముగిశాయి. గత నెల 26న గుంటూరు రేంజ్ పరిధిలో ఎస్‌ఐ అభ్యర్థులకు శారీరక పరీక్షలు ప్రారంభమైన విషయం తెలిసిందే. మధ్యలో వర్షాల వల్ల వాయిదా పడిన పరీక్షలను తర్వాతి తేదీల్లో నిర్వహించారు. సోమవారం చివరి రోజున పరీక్షల నిర్వహణను గుంటూరు రేంజ్ ఐజీ జి.పాలరాజు పర్యవేక్షించారు. తొలుత అభ్యర్థుల ఒరిజినల్/నకలు ధ్రువీకరణ పత్రాలను పోలీస్ అధికారులు, సిబ్బంది నిశితంగా పరిశీలించారు. అనంతరం బయోమెట్రిక్, ఎత్తు, ఛాతీ కొలతలను నమోదు చేసుకున్నారు. 100, 1,600 మీటర్ల పరుగు పందెం, లాంగ్ జంప్ పోటీలు నిర్వహించారు. 81 మంది పురుష అభ్యర్థులు పోటీలో పాల్గొనగా, 39 మంది ఉత్తీర్ణత సాధించారు. గుంటూరు ఏఎస్పీలు (పరిపాలన) కె.సుప్రజ, డీఎస్పీలు శ్రీనివాసరావు (డీసీఆర్బీ), చంద్రశేఖర్ (ఏఆర్), విజయశేఖర్ (ఎస్సీ/ఎస్టీ) ఐజీ కార్యాలయపు సీఐ సుధాకర్, ఆర్ఐలు, సీఐలు, ఎస్ఐలు, మినిస్టీరియల్ సిబ్బంది పాల్గొన్నారు.

నాలుగు రోజుల్లో రిటైనింగ్ వాల్ డిజైన్లు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొండ చరియలు విరిగి పడకుండా రిటైనింగ్ వాల్ నిర్మాణానికి అవసరమైన డిజైన్లను నాలుగు రోజుల్లో సిద్ధం చేస్తామని టెక్నికల్ కమిటీ బాధ్యుడు ఆర్.కొండలరావు తెలిపారు. దుర్గాఘాట్ ఎదుట ఇటీవల కొండ చరియలు విరిగి పడిన ప్రాంతాన్ని టెక్నికల్ కమిటీ సోమవారం పరిశీలించింది. కమిటీ సభ్యులు ఆర్.కొండలరావు, సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ సివిల్ డిపార్టుమెంట్ డీన్ ప్రొఫెసర్ పాండురంగారావు, ప్రొఫెసర్ రమేష్‌కుమార్, త్రిమూర్తి రాజుతో పాటు దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈఓ భ్రమరాంబ ఘాట్‌రోడ్డు వద్ద కొండను పరిశీలించారు. ఘాట్‌రోడ్డు మీదుగా తాడు సాయంతో కొండ చరియలు విరిగి పడిన ప్రదేశానికి చేరుకుని అక్కడి పరిస్థితిని అంచనావేశారు. కొండ చరియలు విరిగి పడకుండా తీసుకోవాల్సిన చర్యలపై దుర్గగుడి ఇంజినీరింగ్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. రాళ్లు, కొండ చరియలు విరిగి పడకుండా శాశ్వత ప్రాతిపదికన చేపట్టాల్సిన పనులను వివరించారు. నాలుగు రోజుల్లో అవసరమైన డిజైన్లు సిద్ధం చేసి దేవస్థానానికి అందజేస్తామన్నారు. దుర్గగుడి ఈఈ కె.వి.ఎస్.కోటేశ్వరరావు, లింగం రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

యార్డుకు 31,315 బస్తాల మిర్చి రాక

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 31,315 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 30,015 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి రూ.23,900 వరకు పలికింది. యార్డులో ఇంకా 10,152 బస్తాల మిర్చి నిల్వ ఉంది.

ఆరోగ్య సురక్షతః

ముమ్మరంగా జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే

- ఉచితంగా ఏడు రకాల వైద్య పరీక్షలు
- ప్రతి ఒక్కరి మొబైల్‌లో యాప్ డౌన్లోడ్
- వ్యాధిని బట్టి వైద్య శిబిరం లేదా ఆరోగ్యశ్రీ ద్వారా మెరుగైన వైద్యం
- ఇకపై ప్రజలకు మరింతగా ఆరోగ్య భద్రత



బాపట్ల రూరల్ ప్రాంతంలో మహిళకు పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

బాపట్ల అర్బన్ : పేదలు తమ ఆరోగ్యంపై ఇక బెంగపడవలసిన అవసరం లేదు. ఆస్పత్రికి వెళ్లాలన్నా.. మందులు కొనాలన్నా.. ఆందోళన కూడా అక్కర్లేదు. ఏ రుగ్మత వచ్చినా యాప్ డౌన్లోడ్ చేసుకుని ఆ వివరాలు నమోదు చేస్తే వెంటనే ఏఎన్ఎం ఇంటికి వచ్చి తక్షణ వైద్య సాయం అందేలా చూస్తారు. ఉపశమనం లభించకపోతే వైద్యాధికారి ఇంటి వద్దకే వస్తారు. ప్రజల వద్దకు పాలన నినాదంతో ముందుకు వెళ్తున్న సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం జనుల ముంగిటకే సంపూర్ణ వైద్య సేవలు అందించే ప్రక్రియకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా నాంది పలికింది.

జగనన్న సురక్ష తరహాలోనే..

ఇప్పటికే జగనన్న సురక్ష ద్వారా ఇంటి వద్దకు అన్ని రకాల సేవలను తీసుకువచ్చిన ప్రభుత్వం ఇప్పుడు ఆ తరహాలోనే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా తొలుత ఏఎన్ఎంలు, వలంటీర్లు జగనన్న ఆరోగ్య సురక్ష యాప్‌ను తమ మొబైల్‌లో డౌన్లోడ్ చేసుకొని ఇంటింటా సర్వే చేపడతారు ఇంట్లోని సభ్యులందరూ ఆరోగ్యంగా ఉన్నారా లేదా, ఎవరికైనా ఏమైనా ఆరోగ్య సమస్యలు ఉన్నాయా, ఉంటే వాటికి చికిత్స పొందుతున్నారా తదితర వివరాలు సేకరిస్తారు. సర్వే ద్వారా గుర్తించిన అనారోగ్య పీడితులకు ఆయా ప్రాంతాల పరిసరాలలోనే శిబిరాలు ఏర్పాటు చేసి వైద్య నిపుణుల ద్వారా చికిత్స అందిస్తారు. అవసరమైతే వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా శస్త్ర చికిత్సలు చేయిస్తారు. ఉచితంగా మందులు అందజేస్తారు. వైఎస్సార్ ఆరోగ్య ఆసరా ద్వారా సాయం కూడా అందిస్తారు.



జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేలో భాగంగా ఓ ఇంటి వద్ద అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

ముమ్మరంగా సర్వే

జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే ప్రస్తుతం ముమ్మరంగా సాగుతోంది. జిల్లాలో 375 విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, 363 ప్రాంతాలు, 12 పట్టణ ప్రాంతాల్లో ఇంటింటా సర్వే చేపట్టారు. వలంటీర్లు జగనన్న ఆరోగ్య సురక్ష యాప్ డౌన్లోడ్ చేసుకొని సర్వే చేస్తున్నారు. ఇంటి వద్దనే కుటుంబ సభ్యులందరికీ ఏడు రకాల వైద్య పరీక్షలు చేస్తున్నారు. ఆ కుటుంబంలోని వ్యక్తి సెల్ ఫోన్‌లో యాప్ డౌన్లోడ్ చేసి సర్వే వివరాలు అందులో అప్లోడ్ చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 5,49,000 కుటుంబాలు ఉండగా శనివారం మధ్యాహ్నం నాటికి 63,000 కుటుంబాల సర్వేను వైద్యసిబ్బంది, వలంటీర్లు పూర్తిచేశారు. 2,30,185 మందికి వైద్య పరీక్షలు చేశారు.

ఈనెల 16 నుంచి 23 మధ్య నిర్వహించిన ఆరోగ్య పరీక్షల వివరాలు ఇవే

పరీక్ష	శ్యాంపిళ్ల సంఖ్య
రక్త పోటు (బీపీ)	82,000
మధుమేహం (షుగర్)	69,000
మూత్రం (యూరిన్)	2,600
హిమోగ్లోబిన్	74,000
మలేరియా	900
డెంగీ	563
కఫం	1,122
మొత్తం	2,30,185

ఈ యాప్ ఆపద్బాంధవే

జగనన్న ఆరోగ్య సురక్ష యాప్ ఉంటే ఆరోగ్యానికి భరోసా దొరికినట్లేనని అధికారులు చెబుతున్నారు. అర్ధరాత్రి, అపరాత్రి అనే భయం లేకుండా కుటుంబంలో ఎవరికి ఆరోగ్యం బాగా లేకపోయినా ఆ వివరాలను ఆ యాప్‌లో పొందుపరిస్తే వెంటనే దగ్గర్లోని ఏఎన్ఎం వచ్చి చికిత్స అందిస్తారు. ఇది రోగులకు ప్రథమ చికిత్సగా ఉపయోగపడుతుంది. రోగి పరిస్థితిని బట్టి వైద్యాధికారి కూడా వచ్చి చికిత్స అందిస్తారు.

జోరుగా ఇంటింటి సర్వే



బాపట్ల జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష ఇంటింటి సర్వే ద్వారా వైద్య పరీక్షలు జోరుగా సాగుతున్నాయి. ఇప్పటివరకు 63,000 ఇళ్లల్లో సర్వే పూర్తి చేశాం. 2,30,185 ఆరోగ్య పరీక్షలు నిర్వహించాం. ఈనెల 30 నుంచి షెడ్యూల్ ప్రకారం ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తాం.

– డాక్టర్ ఎస్.విజయమ్మ, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి

ఆరోగ్యశ్రీ వివరాలు తెలిపే కరపత్రాల పంపిణీ

జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రజలకు మేలు జరుగుతోంది. ఇప్పటివరకు ఏయే వ్యాధులు ఆరోగ్య శ్రీ పరిధిలోకి వస్తాయి, వాటిని పొందాలంటే ఏ పేపర్లు తీసుకెళ్లాలి అత్యవసర వైద్య సాయం పొందే విధానం ఏమిటనే అంశాలు క్షుణ్ణంగా తెలిసేలా కరపత్రాలు ముద్రించి ప్రతి ఇంటికీ పంపిణీ చేస్తున్నారు. దీనివలన ప్రతి ఒక్కరికి వైఎస్సార్ ఆరోగ్యశ్రీ వైద్య సేవలు ఏ విధంగా పొందవచ్చు అనే అవగాహన కలుగుతుంది.

రోగి కోలుకునే వరకు భరోసా

వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో చికిత్స పొందిన రోగి కోలుకోవడానికి కొంత సమయం పడుతుంది. ఆ సమయంలో వారి జీవనానికి ఇబ్బంది కలగకుండా డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య ఆసరా ద్వారా రోజుకు రూ.225 చొప్పున రూ.5,000 వరకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తోంది. తద్వారా కష్టకాలంలో ఆ కుటుంబానికి భరోసానిస్తోంది.

పల్నాడుకు మరో రెండు కేంద్రీయ విద్యాలయాలు

- ఉత్తర్వులు జారీ చేసిన కేంద్రం
- ఎంపీ లావు, ఎమ్మెల్యేలు పిన్నెల్లి, గోపిరెడ్డి కృషి ఫలితం



నరసరావుపేట: పల్నాడు జిల్లాకు మరో రెండు కేంద్రీయ విద్యాలయాలు మంజూరయ్యాయి. మాచర్ల నియోజకవర్గంలోని తాళ్లపల్లి, నరసరావుపేట నియోజకవర్గంలోని రొంపిచర్లలో వీటి ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం సోమవారం ఆమోదం తెలిపింది. రాష్ట్ర వ్యాప్తంగా ఎనిమిది కేంద్రీయ విద్యాలయాల ఏర్పాటుకు ఆమోదం లభించగా అందులో రెండు జిల్లాకు కేటాయించడం విశేషం. ఈ విద్యాలయాల ఏర్పాటు కోసం ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలుతోపాటు ఎమ్మెల్యేలు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి(పీఆర్కే), డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి విశేష కృషి చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే చిలకలూరిపేటలో కేంద్రియ విద్యాలయం అందుబాటులోకి వచ్చేలా ఎంపీ లావు చర్యలు తీసుకున్నారు. పల్నాట ఇప్పుడు తాజాగా మరో రెండు అందుబాటులోకి రానున్నాయి. ఇప్పటివరకు జిల్లాలోని చిలకలూరిపేట, సత్తెనపల్లిలో మాత్రమే ఈ విద్యాలయాలు నడుస్తున్నాయి. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో కేంద్రీయ విద్యాలయాలు తీసుకురావటమే లక్ష్యంగా ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు పనిచేస్తున్నారు.

విద్యాసదుపాయాల మెరుగే లక్ష్యం



పల్నాడులో మెరుగైన విద్యాసదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నాం. ప్రస్తుతం జిల్లాకు రెండు కేంద్రీయ విద్యాలయాలు మంజూరు కావడం ఆనందంగా ఉంది. పల్నాడులోని ఏడు నియోజకవర్గాల్లోనూ విద్యాలయాల ఏర్పాటుకు కృషి చేస్తాను. ఇది నా లక్ష్యం.

– శ్రీకృష్ణదేవరాయలు, ఎంపీ, నరసరావుపేట

కరువుదీరా ఎరువు

- జిల్లాలో 2.50 లక్షల ఎకరాల్లో పంటలు
- అత్యధికంగా 2.20 లక్షల ఎకరాల్లో వరి
- అన్నిరకాల ఎరువులు 40,938 మెట్రిక్ టన్నులు సిద్ధం



సిద్ధంగా ఉన్న ఎరువులు

సాక్షి ప్రతినిధి, బాపట్ల: ఖరీఫ్ సీజన్‌లో ఎరువుల కొరత లేకుండా ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంది. ఈ సీజన్‌లో తొలుత వర్షాలు తక్కువగా ఉన్నా.. ఇటీవల ఓ మోస్తరుగా కురిశాయి. దీంతో చివరి ఆయకట్టు వరకూ రైతులు పంటలు సాగు చేస్తున్నారు. ఇప్పటికే 2.20 లక్షల ఎకరాల్లో వరి పంటను సాగుచేశారు. ఇంకా సాగుకు కొందరు రైతులు సన్నద్ధమవుతున్నారు. అలాగే ఇప్పటివరకు 30 వేల ఎకరాల్లో పత్తి, వేరుశనగ, మినుము, కంది తదితర పంటలు సాగయ్యాయి. దీంతో ప్రభుత్వం సబ్సిడీపై ఎరువుల సరఫరాకు చర్యలు చేపట్టింది. సమృద్ధిగా అందుబాటులో ఉంచింది.

ప్రధాన ఎరువుల నిల్వలు ఇలా..

రకం	అందుబాటులో ఉన్నది (మెట్రిక్ టన్నుల్లో)
యూరియా	10,026
డీఏపీ	5,339
ఎంవోపీ	520
కాంప్లెక్స్	8,173
ఎస్ఎస్‌పీ	1,712
మొత్తం	25,770

మోతాదుకు మించి వాడడం మంచిదికాదు

రసాయన ఎరువులను మోతాదుకు మించి వాడడం మంచిదికాదని అధికారులు సూచిస్తున్నారు. శాస్త్రవేత్తల సూచనలకు భిన్నంగా కొందరు రైతులు వరి, జొన్న, మొక్కజొన్న పంటలకు ఎకరాకు నాలుగు బస్తాలకు బదులుగా 8 బస్తాల ఎరువులు వేస్తున్నారని, అధిక ఎరువుల వాడకం అంత మంచిదికాదని వ్యవసాయాధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. అధిక ఎరువుల వాడకంవల్ల అధిక దిగుబడులు వస్తాయని అనుకోవడం సరికాదంటున్నారు. దీనివల్ల భూములు పాడయ్యే ప్రమాదం ఉందంటున్నారు. భవిష్యత్తులో భూమి నిస్సారంగా మారి పంటల సాగుకు పనికిరాకుండా పోయే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. దీనిని గమనించి రైతులు అధికారుల సూచనలమేరకు తగిన మోతాదులోనే రసాయనిక ఎరువులను వాడాలని అధికారులు చెబుతున్నారు.

అన్నిరకాలూ అందుబాటులో..



జిల్లాలో ప్రస్తుతం సాగవుతున్న పంటలకు అవసరమైన అన్నిరకాల ఎరువులను సిద్ధంగా ఉంచాం. యూరియా, డీఏపీ, ఎంవోపీ, ఎస్ఎస్‌పీ, కంపోస్ట్ ఎరువులు సిద్ధంగా ఉన్నాయి. మొత్తం 40,938 మెట్రిక్ టన్నులు సిద్ధం చేశాం. ఎప్పటికప్పుడు అవసరమైన ఎరువులను తెప్పిస్తున్నాం. రైతుభరోసా కేంద్రాలు, సొసైటీలు, ప్రైవేటు డీలర్ల ద్వారా రైతులకు అందిస్తున్నాం.

– షేక్ అబ్దుల్ సత్తార్, జిల్లా వ్యవసాయాధికారి

సమష్టి కృషితో ఉమ్మడి జిల్లా అభివృద్ధి

జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా



రెండేళ్ల పదవీ కాలం పూర్తయిన సందర్భంగా జెడ్పీటీసీ సభ్యులతో కలిసి కేక్ కట్ చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా

గుంటూరు ఎడ్యుకేషన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడుగుజాడల్లో ఉమ్మడి గుంటూరు జిల్లా అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారుల సమష్టి కృషితో పునరంకితమవుతామని జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా చెప్పారు. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ పాలకవర్గం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం జెడ్పీ సమావేశ మందిరంలో ద్వితీయ వార్షిక వేడుకలను జరుపుకున్నారు. జిల్లాలోని వివిధ మండలాల జెడ్పీటీసీలు హెనీ క్రిస్టినాను సత్కరించారు. ఆమె మాట్లాడుతూ దేవుని దయ, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రథమ మహిళగా ఇదే వేదికపై ప్రమాణ స్వీకారం చేసిన తాను గత రెండేళ్ల కాలంలో జెడ్పీ ఆధ్వర్యంలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించేందుకు శాయశక్తులా కృషి చేశానని చెప్పారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్యంతో అన్యాక్రాంతమైన జెడ్పీ ఆస్తులను పరిరక్షించుకుని, ఆదాయ వనరులను పెంచుకోవడం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు కోట్లాది రూపాయలను వెచ్చిస్తున్నట్లు చెప్పారు. గత రెండేళ్లుగా ఉమ్మడి గుంటూరు జిల్లా అభివృద్ధిలో వెన్నంటి ఉన్న ప్రజాప్రతినిధులు, జెడ్పీటీసీ సభ్యులు, అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు. జెడ్పీలో సీనియర్ అసిస్టెంట్లుగా పని చేస్తున్న ఎనిమిది మంది ఉద్యోగులకు పరిపాలనాధికారులుగా ఉద్యోగోన్నతులు కల్పించడంతోపాటు వారికి వివిధ మండల పరిషత్ కార్యాలయాల్లో పోస్టింగ్స్ ఇచ్చారు. ఉద్యోగోన్నతులు పొందిన వారిలో ఎ.రమేష్ (క్రోసూరు), ఎస్.రామకృష్ణప్రసాద్ (రాజుపాలెం), సీహెచ్ వెంకటేశ్వర్లు (మాచర్ల), ఎం.నాగచంద్రకుమారి (పిడుగురాళ్ల), జె.శర్మ (వెల్దుర్తి), టి.శ్రీనివాసరావు (మంగళగిరి), సీహెచ్ వెంకటరవి (ఈపూరు) ఉన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్, జెడ్పీ సీఈఓ జె.మోహన్‌రావు, జెడ్పీ వైస్ చైర్మన్లు శొంటిరెడ్డి నర్సిరెడ్డి, బత్తుల అనురాధ, జెడ్పీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటి మట్టం సోమవారం 524.70 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 1,800 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 853.50 అడుగుల వద్ద ఉంది. శ్రీశైలం జలాశయానికి జూరాల నుంచి 17,843 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి



స్పందన అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా

కలెక్టర్ రంజిత్‌బాషా

బాపట్ల: జిల్లాలో భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ పి.రంజిత్‌బాషా మాట్లాడుతూ జిల్లాలో భూ వివాదాలపై అర్జీలు ఎక్కువగా వస్తున్నాయన్నారు. భూముల రీ సర్వే సాకుతో సర్వే పనులు చేయకపోతే చర్యలు తప్పవని అధికారులను హెచ్చరించారు. స్పందన అర్జీలు వెంటనే పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జాబ్ మేళా క్యాలెండర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. అలాగే వార్షిక రుణ ప్రణాళిక పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీపీఓ దాసరి రాంబాబు, డ్వామా పీడీ శంకర్ నాయక్, జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు, వ్యవసాయశాఖ జేడీ అబ్దుల్ సత్తార్, పశుసంవర్ధక శాఖ జేడీ హనుమంతరావు, మత్స్యశాఖ జేడీ సురేష్, జిల్లా రవాణా శాఖ అధికారి ఎ.చంద్రశేఖర్ రెడ్డి, పౌర సరఫరాల ఏఎస్ఓ విల్లేమ్స్, డీఎం శ్రీలక్ష్మి, బాపట్ల మున్సిపల్ కమిషనర్ ఎ.భానుప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా దేవీ శరన్నవరాత్రులు



మాట్లాడుతున్న మంత్రి కొట్టు సత్యనారాయణ. చిత్రంలో మంత్రి తానేటి వనిత, ఎమ్మెల్యేలు వెలంపల్లి, మల్లాది, మేయర్ భాగ్యలక్ష్మి, కలెక్టర్ ఢిల్లీరావు, సీపీ రాణా, వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్, దుర్గగుడి చైర్మన్ రాంబాబు

మంత్రులు కొట్టు సత్యనారాయణ, తానేటి వనిత

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): స్థానిక ఇంద్రకీలాద్రిపై శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో వచ్చే నెల 15 నుంచి 23వ తేదీ వరకు జరిగే శ్రీ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను పకడ్బందీగా నిర్వహించి, విజయవంతం చేయాలని అధికారులను దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, ఎన్టీఆర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి తానేటి వనిత ఆదేశించారు. విజయవాడలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో దసరా ఉత్సవాలపై ఆయా శాఖల అధికారులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రులు కొట్టు సత్యనారాయణ, తానేటి వనిత మాట్లాడుతూ.. శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలన్నారు. భక్తులకు ఎటువంటి లోటుపాట్లు లేకుండా అన్ని శాఖలు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఘాట్ రోడ్డులో కొండ చరియలు విరిగి పడకుండా ఇప్పటికే దేవస్థానం పటిష్ట చర్యలు తీసుకుందని, అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా అదనంగా జనరేటర్లు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఉత్సవాల్లో చిన్నారులు తప్పిపోకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు మాట్లాడుతూ.. దుర్గగుడి అధికారులతో సమన్వయంతో చేసుకుని చిట్టచివరి భక్తుడి వరకు అమ్మవారి దర్శనం చేసుకునేలా ఏర్పాట్లు చేయాలన్నారు.

క్లుప్తంగా

సీపెట్‌లో ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణ

గుంటూరు ఎడ్యుకేషన్‌: విజయవాడలోని కేంద్ర పెట్రో కెమికల్స్‌ ఇంజినీరింగ్‌ అండ్‌ టెక్నాలజీ (సీపెట్‌)లో ఓబీసీ, ఎస్సీ నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనతో కూడిన ఉచిత శిక్షణ కల్పిస్తున్నట్లు సంస్థ జాయింట్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ సీహెచ్‌ శేఖర్‌ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. జాతీయ వెనుకబడిన తరగతుల ఆర్థికాభివృద్ధి సంస్థ (ఎన్‌బీసీఎఫ్‌డీసీ), జాతీయ షెడ్యూల్డ్‌ కులాల ఆర్థికాభివృద్ధి సంస్థ (ఎన్‌ఎస్‌ఎఫ్‌డీసీ) సంయుక్తంగా టెన్త్‌లో ఉత్తీర్ణులైన 18 నుంచి 35 ఏళ్ల లోపు వయసు కలిగిన నిరుద్యోగ యువతకు పాలిమర్స్‌ టెక్నాలజీలో మెషీన్‌ ఆపరేటర్‌–ప్లాస్టిక్స్‌ ప్రాసెసింగ్‌, మెషీన్‌ ఆపరేటర్‌ అసిస్టెంట్‌–ప్లాస్టిక్‌ ప్రాసెసింగ్‌ కోర్సుల్లో 3–6 నెలల పాటు ఉచిత శిక్షణ కల్పిస్తామని వివరించారు. అనంతపురం, హైదరాబాద్‌ బెంగుళూరు, హోసూరు, చెన్నై తదితర ప్రాంతాల్లోని ప్రముఖ ప్లాస్టిక్‌, అనుబంధ సంస్థల్లో ఉద్యోగావకాశాలు చూపిస్తామని తెలిపారు. శిక్షణ కాలంలో ఉచిత భోజన, వసతి సదుపాయాలు, ట్రైనింగ్‌ కిట్‌, యూనిఫాం, సేఫ్టీ షూస్‌ను సీపెట్‌ అందజేస్తుందని వివరించారు. ఆసక్తి గల అభ్యర్థులు విద్యార్హతలు, ఆదాయ, సామాజిక వర్గ ధ్రువపత్రాలతో పాటు ఆధార్‌, రేషన్‌కార్డు, నాలుగు పాస్‌పోర్ట్‌ సైజు ఫోటోలతో తమ ప్రతినిధి బాణావతు అంజినాయక్‌ను 7893586494 నంబర్లో సంప్రదించాలని తెలిపారు.

ఫార్మసిస్టుల సేవలు విలువైనవి



ఏఎన్‌యూ: ఫార్మసిస్టుల సేవలు ఎంతో విలువైనవని గైనకాలజిస్ట్‌ డాక్టర్‌ డి.శారద అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఫార్మసీ కళాశాలలో సోమవారం నిర్వహించిన ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవంలో డాక్టర్‌ శారద ముఖ్యవక్తగా పాల్గొన్నారు. ఫార్మసీ విద్యార్థులో జరిగిన ప్రసంగ కార్యక్రమంలో 'ఫార్మసిస్ట్‌ ఇన్‌ పబ్లిక్‌ హెల్త్‌ అండ్‌ డిజైజ్‌ ప్రివెన్షన్‌' అనే అంశంపై ఆమె ప్రసంగిస్తూ ఫార్మసిస్టులు సూపర్‌ హ్యూమన్స్‌ అన్నారు. నేటి సమాజంలో స్థూలకాయం పలు రకరకాల వ్యాధులకు ప్రధాన కారణమన్నారు. క్రమశిక్షణతో కూడిన జీవనశైలి, వ్యాధి నిరోధక టీకాలు ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవడం సులభమని తెలిపారు. రిజిస్ట్రార్‌ ఆచార్య బి.కరుణ మాట్లాడుతూ ఆరోగ్య వ్యవస్థలో ఫార్మసిస్టుల పాత్ర ఎంతో కీలకమన్నారు. కోవిడ్‌ వ్యాక్సిన్‌ అభివృద్ధిలో ఫార్మాసిస్టుల పాత్ర ఎంతో కీలకమమన్నారు. ఫార్మసీ విద్యార్థులు సమాజాభివృద్ధే లక్ష్యంగా కృషి చేయాలని సూచించారు. ఓఎస్‌డీ ఆచార్య కె.సునీత, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్‌ ఆచార్య ప్రమీల రాణి ప్రసంగించారు. 13 సంవత్సరాలుగా ఏఎన్‌యూ ఫార్మసీ కళాశాలలో సేవలు అందిస్తున్న ఫార్మాసిస్టు ఈ పద్మజను అతిథులు సన్మానించారు. ఫార్మసి కళాశాల అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మృతి చెందిన సచివాలయ ఉద్యోగి భార్యకు ఉద్యోగం

నరసరావుపేట: గ్రామ సచివాలయంలో పని చేస్తూ అనారోగ్యంతో మృతి చెందిన ఉద్యాన సహాయకుడి భార్యకు జిల్లా కలెక్టరేట్‌లో సబార్డినేట్‌గా నియమిస్తూ జిల్లా కలెక్టర్‌ ఎల్‌.శివశంకర్‌ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఏ మౌనికకు సోమవారం నియమాక ఉత్తర్వులు అందజేశారు. దాచేపల్లి మండలం పెదగార్లపాడు గ్రామ సచివాలయంలో ఉద్యాన సహాయకుడిగా ఉద్యోగం చేస్తున్న ఏ లక్ష్మీనారాయణ అనారోగ్యంతో ఈ ఏడాది జనవరి 21వ తేదీన మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కారుణ్య నియామకాలకు రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన ఆదేశాల మేరకు కేవలం పదో తరగతి వరకే చదివిన లక్ష్మీనారాయణ భార్య మౌనికకు మళ్లీ సచివాలయ ఉద్యోగం పొందే అవకాశం లేకపోవడంతో ఆమెకున్న విద్యార్హతను బట్టి కలెక్టరేట్‌లో ఉద్యోగం కల్పించారు. తనకు ఉద్యోగం కల్పించిన రాష్ట్ర ప్రభుత్వానికి, అధికారులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్వో కె.వినాయకం పాల్గొన్నారు.

ఎస్టీల జీవనోపాధిని వృద్ధి చేయాలి

జిల్లా కలెక్టర్‌ రంజిత్‌బాషా



అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్‌ రంజిత్‌బాషా

చీరాల: ఎస్టీల జీవనోపాధిని వృద్ధి చేయాలని జిల్లా కలెక్టర్‌ రంజిత్‌ బాషా అధికారులను ఆదేశించారు. చీరాలలోని కలెక్టర్‌ క్యాంపు కార్యాలయంలో రేపల్లెలోని నిర్మల్‌ నగర్‌ ఎస్టీల చెరువుల అభివృద్ధిపై జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని సోమవారం రాత్రి నిర్వహించారు. రేపల్లెలోని నిర్మల్‌నగర్‌ చెరువుల అభివృద్ధికి ప్రభుత్వం రూ.2.70 కోట్ల నిధులు మంజూరు చేసిందన్నారు. అభివృద్ధి కోసం రూపొందించిన ప్రణాళికలను అధికారికంగా ఆమోదిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయని చెప్పారు. 75శాతం నిధులు ఎంపెడా ద్వారా ప్రభుత్వం కేటాయించిందని తెలిపారు. మిగిలిన 25 శాతం నిధులు జిల్లా మినరల్‌ ఫండ్‌ నుంచి కేటాయించినట్లు పేర్కొన్నారు. నిర్మల్‌నగర్‌లోని 157 కుటుంబాలకు చెందిన 157 చెరువులకు విద్యుద్దీకరణ, విద్యుత్‌లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలన్నారు. చెరువుల చుట్టూ రక్షణ వలయాలు ఏర్పాటు చేయాలని, నీటి శుద్ధి యంత్రాలు ఆ ప్రాంతాలలో సిద్ధంగా ఉంచాలని పేర్కొన్నారు. మంజూరు చేసిన నిధులతో ఎస్టీ జీవనోపాధి మెరుగుపడడానికి అవసరమైన సౌకర్యాలు, వసతులు కల్పించాలని అధికారులకు కలెక్టర్‌ సూచించారు. మత్స్య సంపద మీద ఆధారపడి జీవిస్తున్న ఎస్టీల అభివృద్ధి, సంక్షేమం కోసం చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో మత్స్యశాఖ జేడీ పి.సురేష్‌, ఎంపెడా జేడీ జె.బాలు, పీఆర్‌ ఎస్‌ఈ హరేరామకృష్ణ, విద్యుత్‌శాఖ ఎస్‌ఈ ఆంజనేయులు, మైనింగ్‌ శాఖ ఏఈ రాజేష్‌ పాల్గొన్నారు.

సస్యరక్షణతో తెగుళ్ల నివారణ

జిల్లా శిక్షణ సమన్వయకర్త డీడీఏ విజయనిర్మల



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

యద్దనపూడి: సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టంతో పంటలకు ఆశించే పురుగులు, తెగుళ్లను నివారించుకోవచ్చని జిల్లా శిక్షణ సమన్వయకర్త డీడీఏ ఎం.విజయనిర్మల అన్నారు. మండలంలోని వింజనంపాడులో బాపట్ల జిల్లా వనరుల కేంద్రం, ఏరువాక కేంద్రం, బాపట్ల సీనియర్‌ శాస్త్రవేత్త డాక్టర్‌ వీ సురేఖదేవి ఆధ్వర్యంలో పత్తి పొలాల్లో క్షేత్రస్థాయి ప్రదర్శన సోమవారం చేపట్టారు. డీడీఏ విజయనిర్మల మాట్లాడుతూ పత్తి పంటను ఆశించే గులాబిరంగు పురుగు ఉధృతి తెలుసుకునేందుకు ఎకరాకు 10 నుంచి 12 లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. ఇప్పటికే రైతులకు ఆత్మ పథకం ద్వారా మాస్‌ హైపింగ్‌లో భాగంగా ఒక్కో రైతుకు 10 ఎకరాలకు 100 చొప్పున లింగాకర్షక బుట్టలను ఉచితంగా అందజేశామని వివరించారు. దీంతో పాటు పంటను ఆశించే తామర పురుగు నివారణకు పొలం చుట్టూ వయ్యారిభామ, ఉత్తరేణి చెట్లు ఉండకుండా జాగ్రత్త పడాలని కోరారు. శాస్త్రవేత్త సురేఖదేవి మాట్లాడుతూ గులాబిరంగు పురుగు ఆశించిన వెంటనే ఎకరాకు 5 శాతం వేప నూనె లేదా ప్రొఫెనోఫాస్‌ 300 ఎమ్‌ఎల్‌ లేదా థయోడికార్బ్‌ 300 గ్రాములు చొప్పున ఎకరాకు మార్చిమార్చి పిచికారీ చేసుకోవాలన్నారు. సింథటిక్‌ పైరిత్రాయిడ్‌ మందులను పత్తి పంటపై ఎక్కువ సార్లు పిచికారీ చేస్తే రసం పీల్చు పురుగులు, పేనుబంక, ఉధృతి పెరిగే అవకాశం ఉందని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి చల్లగుండ్ల ఆదినారాయణ పాల్గొన్నారు.

ఎంవీఐ తాత్కాలిక కార్యాలయం ప్రారంభం



లైసెన్స్‌ మంజూరు పత్రాలు అందజేస్తున్న ఎంవీఐ రంగారావు

అద్దంకి: పట్టణంలోని శింగరకొండకు సమీపంలో సోమవారం నూతనంగా తాత్కాలిక ఎంవీఐ కార్యాలయాన్ని ఎంవీఐ అధికారి రంగారావు సోమవారం ప్రారంభించారు. ఎంవీఐ మాట్లాడుతూ అద్దంకి ప్రాంతం నుంచి ప్రతి రోజూ 25 లైసెన్స్‌ల వరకు నమోదు అవుతుండడంతో రాష్ట్ర శాప్‌నెట్‌ చైర్మన్‌ కృష్ణచైతన్య జనవరిలో ఎంవీఐ కార్యాలయం కావాలని రవాణా శాఖ కమిషనర్‌కు లేఖ రాశారన్నారు. దాంతో కార్యాలయం కోసం ప్రతిపాదనలు పంపామన్నారు. త్వరలో జీవో జారీ కానుందని చెప్పారు. కొత్త కార్యాలయానికి స్థలం కేటాయింపుతో నూతన కార్యాలయం కూడా నిర్మాణం చేస్తారని చెప్పారు. ప్రస్తుతం మినీ స్టేడియంలో ఒక భాగాన్ని కార్యాలయం కోసం కేటాయించినట్లు వివరించారు. ఇక నుంచి నియోజకవర్గ ప్రజలు లైసెన్స్‌ల కోసం సుదూర ప్రాంతానికి వెళ్లనక్కరలేదని, ఇక్కడ నుంచి ప్రతి వారంలో సోమ, మంగళ, బుధవారాలు మూడు రోజుల పాటు నూతనంగా లైసెన్స్‌లు జారీ చేస్తారని చెప్పారు. అవకాశాన్ని నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవలని కోరారు. కార్యక్రమంలో ఎంవీఐ అంకమ్మరావు, రాంబాబు పాల్గొన్నారు.

అనుమతుల్లేని బయోస్టిమ్‌లెంట్స్‌ అమ్మకాలు నిలిపివేత



మందుల దుకాణంలో తనిఖీ చేస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

నగరంపాలెం(గుంటూరు): గుంటూరు పట్నంబజార్‌లోని ఎం/ఎస్‌ వినాయక ఎంటర్‌ప్రైజెస్‌లో సోమవారం గుంటూరు అర్బన్‌ వ్యవసాయ అధికారులు (1, 2), గుంటూరు సహాయ వ్యవసాయ సంచాలకులు తనిఖీలు నిర్వహించారు. అనుమతుల్లేని సుమారు రూ.10.06 లక్షల బయోస్టిమ్‌లెంట్స్‌ (289.12 లీ/కిలోలు) అమ్మకాలను నిలుపుదల చేశారు. సృజన లైఫ్‌ సైన్సెస్‌ (కూకట్‌పల్లి, హైదరాబాద్‌), రియా అగ్రి సైన్సెస్‌ (కూకట్‌పల్లి, హైదరాబాద్‌), యూనిక్‌ అగ్రికేర్‌ (శ్రీవాణినగర్‌, హైదరాబాద్‌), ఆర్‌ఆర్‌ బయోలాజికల్స్‌ (నిజాంపేట, హైదరాబాద్‌), సుదర్శన్‌ అగ్రో/బయోకెమికల్స్‌ (గోరంట్ల, గుంటూరు) కంపెనీలకు జీ2, జీ3 అనుమతుల్లేవని వ్యవసాయ అధికారులు తెలిపారు. ఆయా కంపెనీలకు బయోస్టిమ్‌లెంట్స్‌ తయారీకి అవసరమైన అనుమతి పత్రాలు జీ2, జీ3 (జీ3 అక్నాలెజ్మెంట్‌) లేకుండా తయారు చేయడం, విక్రయాలు జరపడంతో సదరు కంపెనీల ఉత్పత్తుల అమ్మకాలను నిలుపుదల చేశామన్నారు. తనిఖీల్లో ఏడీఏ టి.శ్రీనివాసరావు, గుంటూరు అర్బన్‌ వ్యవసాయ అధికారి–1 బి.అంజిరెడ్డి, గుంటూరు అర్బన్‌ వ్యవసాయ అధికారి –2 బి.కిషోర్‌ పాల్గొన్నారు.

విజిలెన్స్‌ వ్యవసాయ అధికారిగా రమణకుమార్‌



నగరంపాలెం: రీజినల్‌ విజిలెన్స్‌ / ఎన్‌ఫోర్స్‌మెంట్‌ కార్యాలయ (గుంటూరు) వ్యవసాయ అధికారి (ఏఓ)గా కె. రమణ కుమార్‌ నియమితులయ్యారు. ఫిరంగిపురం మండలం ఏఓగా విధులు నిర్వహిస్తున్న ఆయన విజిలెన్స్‌ ఏఓగా బదిలీయ్యారు. గతంలో ఇక్కడ ఏఓగా పని చేసిన జె.వాసంతి ఫిరంగిపురం మండలం ఏఓగా బదిలీ చేశారు. నూతన ఏఓ రమణ కుమార్‌ మంగళవారం బాధ్యతలు స్వీకరించనున్నట్లు కార్యాలయపు వర్గాలు పేర్కొన్నాయి.

కోల్డ్‌స్టోరేజ్‌లోని శనగలు అమ్ముకున్నారు..

'పి.రమాదేవిది బల్లికురవ మండలం జంగాలపల్లి శివారు కొమ్మినేని వారిపాలెం. 2020, 21 సీజన్లలో పండించిన శనగలు 334.20 క్వింటాళ్లను జె.పంగులూరు మండలం, కశ్యాపురంలోని అన్నదాత కోల్డ్‌స్టోరేజ్‌లో ఉంచారు. రశీదు పొందారు. ప్రస్తుతం శనగలకు ధర పెరగడంతో అమ్ముకునేందుకు కోల్డ్‌స్టోరేజికి వెళ్లారు. సరకు లేదు. నిర్వాహకులు వడ్డవల్లి రామాంజనేయులు, భార్గవ్‌, రాజేష్‌, అంగడిభాస్కర్‌, రాయుని శ్రీకాంత్‌, రాయని వెంకటసుబ్బారావు, మేనేజర్‌ సురేష్‌, సిహెచ్‌.శ్రీలక్ష్మి కుమ్మక్కై తెలియకుండా రూ.20 లక్షల విలువ చేసే నా సొమ్మును అమ్ముకొని నాకు సమాధానం చెప్పడం లేదు.' న్యాయం చేయాలి.

- రూ.20 లక్షలు నష్టపోయానంటూ రైతు ఆవేదన
- స్పందనలో ఎస్పీ వకుల్‌ జిందాల్‌కు ఫిర్యాదు



బాధితుల సమస్యలను తెలుసుకుంటున్న జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్‌

బాపట్లటౌన్‌: జిల్లా పోలీస్‌ కార్యాలయంలో స్పందన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి 70 మంది హాజరై తమ సమస్యలను నేరుగా ఎస్పీకు విన్నవించారు. బాధితుల సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించిన ఎస్పీ వకుల్‌జిందాల్‌, అడిషనల్‌ ఎస్పీ పి. మహేష్‌ వెంటనే సంబంధిత సీఐ, ఎస్‌ఐలతో మాట్లాడి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు.

రైల్వే ఉద్యోగం ఇప్పిస్తానని రూ.32 లక్షలు తీసుకున్నారు

నాకు ఇద్దరు పిల్లలు. ఇంటర్‌ వరకు చదువుకున్నారు. ఏలూరు జిల్లా, ఈదులగూడెం గ్రామానికి చెందిన కొండసాని శిరీష తాను రైల్వే ఉద్యోగిని అని నమ్మబలికి సికింద్రాబాద్‌ రైల్వే కార్యాలయంలో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పడంతో రూ.11 లక్షలు చెల్లించాను. నాతోపాటు మరో ముగ్గురితో రూ.21 లక్షలు కట్టించాను. మమ్ములను సికింద్రాబాద్‌ రైల్వే కార్యాలయానికి తీసుకెళ్ళి అక్కడ రాజశేఖర్‌రెడ్డి అనే వ్యక్తితో మా పిల్లలకు ఇంటర్వ్యూలు కూడా నిర్వహించారు. అక్కడ మరో రూ.లక్ష తీసుకున్నారు. కాగితాలు ఢిల్లీ పంపించాలి. తిరిగి రాగానే కబురు చేస్తామని చెప్పి సమాధానం చెప్పడం లేదు. సదరు వ్యక్తిపై ఆరా తీస్తే ఇదంతా ఫేక్‌ అని తెలిసింది. మోసం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి.

– సనకా రామకృష్ణ, గొరిగపూడి, భట్టిప్రోలు మండలం

రైల్వే డీఎస్పీ పేరుతో రూ.8 లక్షలు స్వాహా

అద్దంకి మండలం, బొమ్మనంపాడు గ్రామానికి చెందిన మందా నాగరాజు, రైల్వేశాఖలో డీఎస్పీగా ఉద్యోగం చేస్తున్నట్లు నమ్మించి.. మీ పిల్లలకు ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మబలికి పలువురి వద్ద నుంచి రూ.8 లక్షలు స్వాహా చేసినట్లు ఎస్పీకి విన్నవించారు.

–బందారు చంటిబాబు, బొమ్మనంపాడు, అద్దంకి మండలం

వైఎస్సార్‌ సీపీ నుంచి భవనం సస్పెన్షన్‌

బాపట్ల: జిల్లాలోని పర్చూరు నియోజకవర్గానికి చెందిన వైఎస్సార్‌ సీపీ నాయకుడు భవనం శ్రీనివాసరెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్‌ చేశారు. పార్టీ అధ్యక్షులు వైఎస్‌ జగన్‌మోహన్‌ రెడ్డి ఆదేశాలు మేరకు భవనం శ్రీనివాసరెడ్డిని సస్పెండ్‌ చేసినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం సోమవారం సాయంత్రం ఒక ప్రకటన విడుదల చేసింది. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో పార్టీ క్రమశిక్షణ కమిటీ సిఫార్సు మేరకు పార్టీ అధ్యక్షులు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటనలో పేర్కొన్నారు.

ఎస్టీయూ పల్నాడు జిల్లా అధ్యక్షుడిగా రామిరెడ్డి



పిడుగురాళ్ల: ఎస్టీయూ పల్నాడు జిల్లా అధ్యక్షుడిగా ఎల్వీ రామిరెడ్డి ఎన్నికయ్యారు. పట్టణంలోని ఎస్టీయూ కార్యాలయంలో ఎస్టీయూ జిల్లా కార్యవర్గ సమావేశం సోమవారం నిర్వహించారు. ఇప్పటి వరకు జిల్లా అధ్యక్షుడిగా ఉన్న దార్ల పెదబాబు గుంటూరు జిల్లా అధ్యక్షుడిగా ఎన్నిక అవడంతో పల్నాడు జిల్లా అధ్యక్ష పదవికి రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శిగా పని చేస్తున్న ఎల్వీ రామిరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్‌.సాయిశ్రీనివాస్‌, హెచ్‌.తిమ్మన్న, రాష్ట్ర పూర్వ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్‌ జోసెఫ్‌ సుధీర్‌ బాబు, ఎం.రఘునాథరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్‌ఎం సుభాని, పి.శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.చంద్రజిత్‌ యాదవ్‌, ఆర్థిక కార్యదర్శి ఎ. ఏమండి పాల్గొన్నారు.

ఎస్‌ఈబీ స్టేషన్‌ తనిఖీ



క్రోసూరు: క్రోసూరు ఎస్‌ఈబీ స్టేషన్‌ను స్పెషల్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ బ్యూరో డెప్యూటీ కమిషనర్‌(హెడ్‌ క్వార్టర్స్‌) పి.నాగమద్దయ్య, నరసరావుపేట ఎన్‌ఫోర్స్‌మెంట్‌ సూపరింటెండెంట్‌ డి.ఎస్‌.దుర్గాప్రసాద్‌తో కలసి సోమవారం సందర్శించారు. నాన్‌ డ్యూటీ పెయిడ్‌ మద్యం రవాణా, నాటు సారా విక్రయాలు తదితర నేరాలపై ఎస్‌ఈబీ ఇన్‌స్పెక్టర్‌ కె.వినయ్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర సరిహద్దు ప్రాంతాలైన పులిచింతల పోలీస్‌ చెక్‌ పోస్ట్‌, మాదిపాడు చెక్‌ పోస్టలను సందర్శించారు. వీరి వెంట ఎస్‌ఈబీ ఇన్‌స్పెక్టర్‌ వినయ్‌ ఉన్నారు.

రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు విద్యార్థుల ఎంపిక



పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

జే పంగులూరు: రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు విద్యార్థులు ఎంపికై నట్లు చందలూరు పాఠశాల హెచ్‌ఎం గిరిజ సోమవారం తెలిపారు. ఒంగోలులోని పింగళి కోదండ రామయ్య సంస్కృతాంధ్ర ఓరియంటల్‌ పాఠశాలలో జిల్లా స్థాయి యోగా పోటీలు నిర్వహించారు. అండర్‌–14, అండర్‌–17 విభాగంలో జరిగిన పోటీలకు చందలూరు పాఠశాల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. అండర్‌–14 విభాగంలో మంచి ప్రతిభను చాటిన శ్రుతి, ఎం.వెంకటేష్‌, స్టాండ్‌బై కింద జి.శశికుమార్‌ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్‌–17 విభాగంలో ఎన్‌.సుప్రియ మంచి ప్రతిభను కనపరచి రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. ఎంపికైన విద్యార్థులు అక్టోబర్‌ మొదటి వారంలో పశ్చిమ గోదావరిలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు హాజరవుతారని హెచ్‌ఎం చెప్పారు. విద్యార్థులను హెచ్‌ఎం గిరిజ, పీడీ ప్రతిమ అభినందించారు.

సీజనల్‌ వ్యాధులు ప్రబలనివ్వకండి

- సమన్వయంతో కలసి పనిచేయండి
- గుంటూరు కలెక్టర్‌ వేణుగోపాల రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్‌ వేణుగోపాల రెడ్డి

గుంటూరు వెస్ట్‌: సీజనల్‌ వ్యాధులు ప్రబలకుండా వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని గుంటూరు జిల్లా కలెక్టర్‌ ఎం.వేణుగోపాల రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్‌ఆర్‌ శంకరన్‌ సమావేశ మందిరంలో నిర్వహించిన అధికారుల సమావేశంలో కలెక్టర్‌ మాట్లాడుతూ పారిశుద్ధ్య పనులు చేపట్టడంతోపాటు తాగునీరు కలుషితం కాకుండా చూడాలన్నారు. ముఖ్యంగా నీటి పరీక్షలు క్రమం తప్పకుండా నిర్వహించాలన్నారు. నీటి సమస్యలుంటే డయేరియా వ్యాధులు సంక్రమించే అవకాశ ముంటుందన్నారు. ప్రతి 15 రోజులకొకసారి ట్యాంకులను శుభ్రం చేయాలన్నారు. పారిశుద్ధ్య పనులు సరిగ్గా నిర్వహించకపోతే డెంగీ, మలేరియా వ్యాధుల విస్తరణకు దారితీస్తాయన్నారు. ఈ నెల 30న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్‌.జగన్‌మోహన్‌ రెడ్డి ప్రారంభించనున్నారని చెప్పారు. ఇంటింటి సర్వే పూర్తి చేసి చికిత్సలను అందించాలని చెప్పారు. స్కూల్‌కు వెళ్లని పిల్లల్ని ఓపెన్‌ స్కూల్స్‌లో చేర్పించాలని చెప్పారు. సమావేశంలో డీఆర్వో చంద్రశేఖరరావు, డీఆర్‌డీఏ పీడీ హరిహరనాథ్‌, డీఈఓ శైలజ, సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్ట్‌ కో ఆర్డినేటర్‌ విజయలక్ష్మి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఆరోగ్యరంగానికి ఫార్మసిస్టులు మూలస్తంభాలు



విద్యార్థుల ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న పల్నాడు జిల్లా అధికారి డాక్టర్‌ రవి

నరసరావుపేట: ఫార్మసిస్టులు ఆరోగ్య రంగానికి మూల స్తంభాలాంటి వారని, ప్రపంచ ఆరోగ్య పరిరక్షణలో వారి పాత్ర ఎంతో విశిష్టమైందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్‌ బి.రవి కొనియాడారు. ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవం సందర్భంగా పల్నాడు రోడ్డులోని డీఎండీహెచ్‌ఓ కార్యాలయం ఆవరణలో ఫార్మసీ సెంత్‌తో హెల్త్‌ సిస్టం అనే నినాదంతో వేడుకలు సోమవారం నిర్వహించారు. ఏరియా హాస్పిటల్‌ సూపరింటెండెంట్‌ డాక్టర్‌ ఎం.మంత్రునాయక్‌ మాట్లాడుతూ ప్రపంచంలో వైద్య సేవలు కొనసాగినంత కాలం ఫార్మసిస్టుల కొనసాగింపు ఉంటుందన్నారు. వారు లేనిదే ప్రజల ఆరోగ్య పరిరక్షణ అంత సులువు కాదని చెప్పారు. అనంతరం విద్యార్థుల ర్యాలీని డీఎండీహెచ్‌ఓ జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ కార్యాలయం నుంచి బయలుదేరి పల్నాడు బస్టాండ్‌ మీదగా గడియారం స్తంభం వరకు కొనసాగింది. జిల్లా ఎయిడ్స్‌ హెచ్‌ఐవీ, టీబీ కంట్రోల్‌ అధికారి డాక్టర్‌ పద్మావతి, ఏరియా హాస్పిటల్‌ ఆర్‌ఎంఓ డాక్టర్‌ దయానిధి, డెప్యూటీ డిస్టిక్‌ ఎక్స్‌టెన్షన్‌ మీడియా అధికారి కే సాంబశివరావు, సిద్ధార్థ, చెన్నుపాటి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాళ్లు, విద్యార్థులు పాల్గొన్నారు.